# లచ్చి

శ్రీశాంతి దుగ్గిరాల



**కథ:** లచ్చి

**రచన:** శ్రీశాంతి దుగ్గిరాల

ప్రచురణ: కినిగె పత్రిక http://patrika.kinige.com

కాలం: అక్టోబరు 2014

శాశ్వత లింకు : http://patrika.kinige.com/?p=3992

©Author.

**What can you do with this document?**

Read it!
Store this PDF on your device.
Share the link with your friends
Share this PDF with your friends via personal communication (e.g. email)
Take printouts for personal use

**What is not allowed by Owner of this document?**
Editing the document. No page to be removed or added.
Distributing to public (instead kindly share the link to Kinige given above)

తనలో వయసుతో వస్తున్న మార్పులు నాకు తెలియవు. నాకు వయసొచ్చే నాటికి తను నా దగ్గరలేదు. బహుశా నాకు లచ్చి అందరికన్నా ప్రత్యేకంగా కనిపించడానికి ఆ వయసే కారణమేమో.

చిన్నతనంలో ఎప్పుడూ నీడలా వెంటాడేవి తనని నా చూపులు. తను ఎక్కడికివెళ్ళినా వెంట వెళ్ళేదాన్ని. లచ్చికి నేరేడు పళ్ళంటే భలే ఇష్టం. నాలాంటి పిలకాయలందరినీ వెంటేసుకుని నేరేడు చెట్లదగ్గరకు తీసుకుపోయేది.

పండిన పళ్లు మామూలుగా చెట్లకింద రాలేవి. కాని ఆ నేల పశువులు తిరిగేది కావడం వల్ల అవి బాగుండేవి కావు, పైగా అంతెత్తు నుండి పడి చితికిపోయేవి. అందుకోసం మాలో ఒకరిని వంతుల వారిగా చెట్టు ఎక్కించేది. ఎవరూ లేని రోజు తనే ఎక్కేసేది. అందిన మట్టుకు, పండిన మట్టుకు చెట్టు దగ్గరే తినేసి ఇంటికి చక్కా వచ్చే వాళ్ళం.

అందరం బలే అల్లరి చేసేవాళ్ళం. మాకు నచ్చిన కాయా పువ్వా ఏ దొడ్డో వున్నా దొబ్బుకొచ్చేయాల్సిందే అన్నట్టుండేది మాయవ్వారం. ఇళ్ళల్లో మా ఈపులు సాపైపోయినా మా అల్లరి అగేది కాదు. చిన్నపిల్లలం మాకు తగిలినట్టుగానే లచ్చికి కూడా ఇంట్లో ఆళ్ళమ్మ తెగ తన్నేది. అన్ని తన్నులు తిన్నా మా తీరు ఏం మారేది కాదు. అంతేకాదు మా ఏషాలకు బాగా ఇసుగొచ్చి దుర్గమ్మ అని మా పొరుగింటి గయ్యాళి మేమంటేనే కళ్ళల్లో నిప్పులు పోసుకుంటా మాకు పరమ శత్రువైపోయింది. ఎప్పుడెప్పుడు మమ్మల్ని పట్టుకుందారా అని దాని ఎత్తు. మేం చిక్కితే కదా...

ఓరోజు మా గుంపులో మహా పిరికిదైన సరోజను పక్కింటి దుర్గమ్మ దొడ్డో ఎర్రగులాబి ఎత్తుకు రమ్మన్నాం. అది గజగజా వణికిపోయింది "నాకు భయంగా ఉందే లచ్చి ఆ దుర్గమ్మసలే రాకాసి. మాయమ్మకి నేను బడిఎగ్గొట్టానని చెప్పిందనుకో, మాయమ్మ కోడి పీక కొరికినట్టు నాపీక కొరికేద్ది. మీకు దండం ఎడతాగానీ నన్నొదిలేయండే."

"ఆ నువ్వు బడి కెళ్ళి పెద్ద గోడిమెడలు తెత్తవని పాపం నీ మీద పాణాలెట్టుకుంది మీయమ్మ. మాఎంట తిప్పుకుని అమ్మాయిగారిని బలవంతంగా పాడుచేసేత్తన్నాం మరి."

"మరాదగా చెప్పిన పని చేత్తే సరి నెదంటే నువ్విచ్చిన పార్టీ ఇషయం మీయమ్మతో చెప్పేత్త" అంది చిట్టి.

"నువ్వు ఒట్టి పిరికిగొడ్డువని ఒప్పేసుకో" అన్నాన్నేను.

"నీతో కాదుగానీ ఆ చిట్టినంపుతాలే, అదయితే కళ్ళు మూసి తెరిచే లోగా నా ముందుంటాది" అంది లచ్చి.

మొత్తానికి చచ్చినట్టు ఒప్పుకుంది సరోజ. అదొప్పుకోడానికి చిన్న కిటుకుందిలెండి. చాలా రోజుల క్రితం ఆళ్ళమ్మ పోపులడబ్బాలో దాచిన పదిరూపాయలు నెమ్మదిగా ఎత్తుకొచ్చేసింది సరోజ. ఆ డబ్బుతో జీళ్ళ అప్పన్నదగ్గర తినగలిగినన్ని జీళ్ళు తినేసి మిగిన డబ్బుతో మా అందరికీ పార్టీ ఇచ్చింది. తినడం అయిపోయాకా గానీ గుర్తురాలేదు దానికి ఆళ్ళమ్మ ఒళ్ళూనం చేసేద్దని. ఇక ఒకటే ఏడుపులంకించుకుంది. మీయమ్మొచ్చి అడిగినా నీ ఇషయం చెప్పం అని ఏదో నచ్చజెప్పి ఇంటికి పంపేశాం. అదీ కారణం, ఆ విషయం ఎక్కడ బైటికొచ్చేద్దోనని దాని భయ్యం. ఇంకోటేంటంటే ఆళ్ళమ్మ ఈరమ్మ అంత తేలిగ్గా మరిచిపోయే రకంకాదు. కితం సంవత్సరం నాగులచవితి నాడు దొగతనంగా తిన్న కొబ్బరుండ కోసం ఆరునెల్ల తర్వాత కొట్టింది సరోజను. మాచెడ్డ మనిషిలెండి. పతి ఇషయానికీ ఊరంత నోరెసుకుని ఎదుటోళ్ల మీద పడిపోద్ది.

ఆళ్ళమ్మను తలుచుకుని నిప్పంటుకున్న తారాజువ్వలాగా సర్రున దుర్గమ్మ పెరడు వైపు పరుగెత్తి పోయింది సరోజ. చేయెత్తు గోడ చిన్న మెట్టెక్కి అందుకుని ఎలాగో పువ్వు కోయబోయింది సరోజ. ఈలోపల గోడెనక గేదెకు గడ్డేస్తున్న దుర్గమ్మ పెద్దకర్రట్టుకుని సరోజెనక పడింది. దుర్గమ్మ గోడెనకే కాపుకాచిన మేమూ పరుగందుకున్నాం. ఇలాంటి దొంగపనుల్లో సులువు తెలిసిన మేము అందలేదుగానీ పాపం బక్కది సరోజ చిక్కేసింది.

పారిపోయి ఇంటికి చేరుకున్న మాకు సరోజ చిక్కిన విషయం చాలా సేపటికి గానీ తెలియలేదు. ఆళ్ళమ్మకి తెలిత్తే సరోజీపు చాకిరేవు బండయిపోద్ది, ఏలాగైనా ఇడిపించాలని మళ్ళీ దుర్గమ్మింటికి బయలుదేరాం. అప్పటికే సరోజని పెరట్లో చెట్టుకట్టేయడం అది ఊరంతా ఏకమైనట్టు సోకాలెట్టేయడం ఐపోతున్నాయి.

మా లచ్చి ఏదో ప్లాను అప్పటకే రడీ చేసేసింది. నేను సాయంకాలం దుర్గమ్మింటికి పాలుకి ఎళతాను, అలానే వెళ్ళమంది. నాకు పాలు పోయడానికి ఆవిడ లోనికెళ్ళినపుడు సరోజను ఇడిపించేయాలి అదీ ప్లాను.

లచ్చి చెప్పినట్టే చెంబట్టుకెళ్ళాను. ఈలోపు ఆవిడలోనికెళ్ళగానే లచ్చి, చిట్టి కలిసి సరోజను ఇడిపించేసారు. దుర్గమ్మొచ్చేసరికి అంతా అక్కడి నుండి పారిపోయాం. మా వెనక దుర్గమ్మ అరుపులు ఇనిపిత్తానే ఉన్నాయి.

“ఆగండే పిల్లముండల్లారా ఈ కోలనీకే మాయదారి సంతైపోయారు గదే, ఓ పూవుండనీరు, కాయుండనీరు మాయదారి సంతాని…” అందరం నవ్వుకుంటూ ఇంటికొచ్చేసాం. గులాప్పువ్వులే కాదు జామకాయలూ ఉండనిచ్చేవాళ్ళం కాదు. దుర్గమ్మకు మాంచి జాంచెట్టు కూడా ఉంది. ఆ పళ్ళు భలే రుచిగా ఉంటాయి.

దసరా రాత్రుల్లో అమ్మోరి గుడి దగ్గర తెర మీద వేసే సినిమాలకోసం పందేలు వేసుకుని మరీ పరిగెట్టిపోయేవాళ్ళం. మాకన్నా ముందుగా గోనిపట్టా పరుచుకున్న పక్కీది పిల్లలతో తగువులాడి కూచోపెట్టేది లచ్చి. సగం సినిమా నడుస్తుండగానే నిద్రకు ఆగలేక ఊగిపోతున్న మమ్మల్ని చెరోచేత్తోనూ పట్టుకుని ఇంటికి తీసుకువచ్చేది లచ్చి.

మా ఊళ్ళో మాబాగా జరుగుతాయి అమ్మోరి జాతర, తిరనాళ్ళు. చూడ్డానికి రెండు కళ్ళు చాలవు. రంగురంగు బుడగలు, రబ్బరు బొమ్మలు, కొయ్య గుర్రాలున్న రంగుల రాట్రాలు, చల్లయిసు, చెరుకురసం ఇంకా చాలా బాగుంటాది. లచ్చేకాదు పిలకాయమంతా వారం అంతా కూడబలుక్కుని ఓణీలేసుకుని తయారైపోయాం. లచ్చికన్నా చిన్నోళ్ళమైన మాకు లచ్చికి నప్పినంతగా నప్పలేదు ఓణీ. నాకు, సరోజకు పరవాలేదన్నట్టున్నా, మాకన్నా చిన్నదైన చిట్టికి దారిలోనే జారిపోయింది. “నీకెందుకే బక్కదానా ఓణీ అని ఎంత నచ్చజెప్పినా” ఒప్పుకుంటేగా ఆ బక్కది తెగ యాగీ చేసేసింది దారంటా.

తిరనాళ్ళంతా తిరిగి రకరకాలు బొమ్మలు కొనుకున్నాం. చిట్టి డప్పువాయించే కోతి కొనుక్కుంది. దాన్ని చూసి లచ్చి తెగ ఏడిపించింది చిట్టిని. అది బుంగమూతి పెట్టింది. లచ్చి రంగురంగు జడ రిబ్బన్నులు కొనుక్కుంది. నేను రంగు తిలకం బుడ్డి కొనుక్కున్నాను. ఇక పిసినారి సరోజేమో నాకెం నచ్చలేదబ్బా అన్నీ నాసిరకాలు ఒద్దులే అంటా మూతి తిప్పుకున్నాది.

అందరం రంగుల రాట్రం ఎక్కాము. లచ్చికి బాగా అలవాటు లాగుంది. నాకు ఎక్కగానే కళ్ళు తిరిగి వాంతులైపోయాయి. పాపం లచ్చినాకు కలరు షోడా పట్టించి ఇంటికి తీసుకొచ్చింది. లచ్చితో తొక్కుడు బిళ్ళ ఆడ్డం చాలా కష్టం ఎంతో హుషారుగా ఆడేది. అలానే అష్టాచెమ్మా కూడా

ఎప్పుడూ తనచేతిలో ఓడిపోయేదాన్ని. నన్ను ఓడించినప్పుడల్లా నాకు బాధకన్నా తన ముఖంలోకి ఆనందం వెలుగు బలే తమాషాగా అనిపించేది. నిజానికి తనకు నాకు పదేళ్ళు తేడా.

ఎక్కడా ఆడపిల్ల కుండాల్సిన సుకుమారంలేదు లచ్చిలో. ఎక్కడో చిన్న తేడా, కాస్త మెరటుతనం, మగరాయుడితనం ఉన్నాయి తనలో. మాకన్నా వయసులో పెద్దదైనా ఎక్కడా పెద్దరికం కనబడనీయక మాతో సమానంగా ఆడేది. పరికిణీ నుండి ఓణీకి మారినా తనకు పెళ్ళి చేయాలని పెద్దాళ్ళు కంగారు పడేవారుగానీ దానికి ఆ వూసే లేదు. ఎప్పుడూ ఆటలే.

గుంపంతా ఆదివారం మెట్లకింద చేరిపోయి తాటాకు, కొబ్బరాకులతో బొమ్మ పెళ్ళికి ఏర్పాట్లు చేసేవారం. చిన్న చీరముక్కలతో బట్టలు చుట్టి, బొట్టూకాటుకా పెట్టి, చిన్న పూసలతో దండలు చేసి వేసేవాళ్ళాం. సినిమాపాటలతో మంత్రాలు చదివి, తలంబ్రాలు పోసేవాళ్ళాం. అందరికీ పప్పూబెల్లాలు పంచేవాళ్ళాం. ఆటలమీద చూపించిన ఇష్టం లచ్చి బొమ్మ పెళ్ళిలో చూపేది కాదు. అసలు రానని తెగ యాగీ చేసేది. బొమ్మ పెళ్ళేకాదు. తన ఈడువారికి పెళ్ళవుతుందని తెలిస్తే ఆనందంకన్నా తన మనసులో విచారమే ఎక్కువ కనిపించేది నాకు.

అందరినీ వదిలివెళిపోవాలనే దానికంటే మించిన దిగులు పడేది లచ్చి. ఏం కారణమో పైకి చెప్పేది కాదు. అంత సరదా అయిన మనిషి ఒక్కసారిగా మూగనోము పట్టిన దానిలా అయిపోతే మాకేం బాగుండేదికాదు. ఏం అడిగినా చెప్పేదికాదు. చాలా బతిమాలి చక్కిలిగిలి పెడితేనేగానీ మాతో ఆటకొచ్చేదికాదు.

కాలం అంతా ఒకేలా సాగిపోదుగా. లచ్చికి పెళ్ళి సంబంధం కుదిరిపోయింది. అది తెలిసిన దగ్గరనుండీ తను మాకు దూరమైపోతుందన్న దిగులు ఎక్కువైపోయింది నాకు. అందరికీ పెళ్ళికి కొత్తబట్టలు కొంటారు. ఇంచక్కా స్వీట్లు తినచ్చునని సరోజా, చిట్టీ తెగ సంబర పడిపోయారు.

ఇక ఆరోజు నుండీ లచ్చి మాతో ఆటలకు రావడం మానేసింది. చెట్టెక్కడానికి పరికిణీ కచ్చాపోసే లచ్చి చేత చక్కగా చీర కట్టించింది వాళ్ళమ్మ. మాతో ఆటలకు రాటంలేదని బాధకన్నా పెళ్ళి చేసుకు వెళిపోతున్నందుకు దిగులు పెట్టేసుకుంది లచ్చి.

చాలా తొందరగానే ముహుర్తం కుదిరిపోయింది. పెళ్ళికన్ని ఏర్పాట్లు చేసేసారు. రెండురోజుల ముందు లచ్చిని పెళ్ళికూతుర్ని చేసారు. ఇప్పుడు మరింత అందంగా ఉంది లచ్చి. పాములాంటి కళ్ళు, తెల్లని మేనిఛాయ, ఎర్రని సిల్కులాంటి జుట్టు, వంటినిండా లేత గోధుమ రంగు

నూగుతో సీమ దొరసానిలా ఉంది. మొదటిసారిగా చాలా బాగుంది లచ్చి అందంగానే కాదు దానికన్నా చెప్పలేనితనంతో.

★ ★ ★

నాకు తెలుసు లచ్చి ఇక ఎప్పుడూ మాతో ఆడదని ముందులా పూలు, కాయలు దొంగతనంగా కోయదని. నేరేడు పళ్ళు అందరిలా కొనుక్కొని తింటుంది కానీ మాతో కలిసి చెట్టెక్కి కోసుకు తినదని.

తెల్లారితే ఆదివారం అనగా పెళ్ళి జరిగిపోయింది. పెళ్ళికొడుకుని దుర్గమ్మ నిద్రముఖాలతో కుర్చీల్లో వాలిపోతున్న మాదగ్గరకు తీసుకొచ్చి "వీళ్ళేనయ్యా నీ పెళ్ళం అల్లరి గుంపు. ఈళ్లంతా కలిసి చుట్టుపక్కల ఏ దొడ్డోనూ పూలుగానీ కాయలు కానీ ఉండనిచ్చేవారు గాదు. గుంపు నాయకురాలు ఎళిపోతుందిగా, ఇక ఈళ్ళ తోకలు నేను కత్తిరించేస్తాను" అంది మమ్మల్ని చూపించి.

అందరిముందూ ఎంతో అవమానం జరిగిపోయిందని గంటు ముఖాలెట్టుకున్నాం. ఈలోపులో లచ్చి రానేవచ్చింది. అప్పటి వరకు ఆడుకోవడం ఒక్కటే తెలిసిన లచ్చి నోటివెంట మొదటిసారి తన మొగుడితో కమ్మగా మాట్లాడటం విన్న నాకు చాలా ఆశ్చర్యం కలిగింది అసలు ఇంత సిగ్గుపడుతున్న పిల్ల మా లచ్చేనా అనిపించింది.

బుధవారానికి లచ్చి అత్తారింటికెళిపోయింది. రోడ్డు మలుపు తిరిగే వరకూ చేయూపుతూనే ఉంది. చిట్టి, నేను, సరోజా ముగ్గురం ఒకరినొకరం గట్టిగా పట్టుకు ఏడిచేసాం. మా పెద్దోళ్ళంతా కాస్త బాధపడినా మమ్మల్ని ఊరడించడానికి "మళ్లీ ఓ నెల్లో వచ్చేద్ది బావ దగ్గర ఆషాడంలో ఉండకూడదుకదా" అన్నారు. ఆరోజుకోసం ఎదురుచూస్తూ తప్పదన్నట్టు బడికెళుతున్నాం.

నెల రోజులకు లచ్చి వచ్చింది. తనని చూడాలని వెళ్ళిన మా ఎవరితోనూ మాట్లాడలేదు. మేం ఎంత పలకరించినా పలకలేదు. చాలా దిగులేసింది. పెళ్ళికాగానే లచ్చిలో అనుకోని ఈ మార్పుతో చాలా ఏడుపొచ్చేసింది.

సరోజ లచ్చి దగ్గర గట్టిగానే అనేసింది. "ఆ పెళ్ళవగానే నువ్వు ఇలా మారిపోతావని మునిపటిలా మాట్లాడవని, అసలు గుర్తే పట్టవని మాయమ్మ ముందే చెప్పింది. పదే చిట్టీ పోదాం," అంటూ మూతి మూడొంకర్లు తిప్పుకుని చిట్టీ, సరోజా అక్కడి నుండి వెళిపోయారు. నేను ఎంత మాట్లాడించినా బతిమాలినా ఏం చెప్పలేదు. చక్కిలిగిలి పెట్టినా నవ్వలేదు.

అప్పుడనిపించింది నాకు పెళ్లికాగానే అందరినీ మరిచిపోతారా, ఆఖరుకి చక్కిలిగిలి కూడా పోతుందా అని. చేసేదేంలేక ఇక అక్కడినుండి ఇంటికొచ్చేసాను. ఆరోజు నుండీ సరోజా చిట్టీ లచ్చి ఊసే ఎత్తడం మానేసారు.

★

For Latest Telugu Books - Visit now:
Kinige
.com